పట్టణాభివృద్ధే అజెండా


అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటిస్తున్న చైర్మన్

అద్దంకి: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మునిసిపల్ పాలక వర్గం పనిచేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ అన్నారు. స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం చైర్మన్ అధ్యక్షతన కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ అర్జునరావు అజెండాలోని అంశాలను చదివారు. 32 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. దీనిలో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.12 కోట్లతో పలు వార్డుల్లో సీసీ రహదారులు, సీసీ డ్రైనులను నిర్మాణ పనులకు అనుమతి తెలియజేశారు. వాటిలో రూ.3లక్షలతో 19వ వార్డులో సీసీ రోడ్, సీసీ డ్రైన్ నిర్మాణం. 15వ వార్డులో రూ.1లక్షతో సీసీ రహదారి, 3వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ డ్రైన్, 18వ వార్డులో మురుగు ప్రవహించేందుకు తూముల ఏర్పాటు, 18, 5 వార్డుల్లో రూ.18 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం, 5వ వార్డులో రూ.4.20 లక్షలతో సీసీ రహదారి, 4వ వార్డులో రూ.4 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. అదే విధంగా సహజ మరణం పొందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు అందజేయాల్సిన ఎక్స్‌గ్రేషియా 2వ వార్డులో రూ.17లక్షలతో సీసీ రహదారి, సీసీ డ్రైన్‌ల నిర్మాణం, 3.5 లక్షలతో 1వ వార్డులో సీసీ డ్రైన్, రూ.1లక్షతో జంగిల్ క్లియరెన్స్, బయో మెట్రిక్ డివైజ్ కొనుగోలుకు నిర్ణయించారు. లిక్విడ్ క్లోరిన్ కొనుగోలు, స్వచ్ఛత హీ సేవా కార్యక్రమానికి అవసరమైన ఫ్లెక్సీలు, టోపీలు, బనియన్లు కొనుగోలు, కంజర్వేషన్ మెటీరియల్ కొనుగోలు, 1,16,17, వార్డుల్లో 18 వార్డుల్లో రూ.16.5లక్షలతో సీసీ రహదారులు, సీసీ డ్రైన్‌ల నిర్మాణానికి అంతా అంగీకరించారు. 9వ వార్డులో సీసీ సీసీ డ్రైన్, 1నుంచి 20వ వార్డుల్లో ప్రతి వార్డులో రూ.15 లక్షలతో బోర్ వెల్‌ల ఏర్పాటు, 3వ వార్డులో రూ.605 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం చేయాలని తీర్మానించారు.

30న జగనన్న సురక్ష

ఈ నెల 30న స్థానిక మునిసిపల్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. వార్డు కౌన్సిలర్లు తప్పనిసరిగా పాల్గొనాలని చెప్పారు. అక్టోబర్ 2న స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించాలని తలపెట్టినట్లు చెప్పారు. కౌన్సిలర్లు పాల్గొనాలని ఆ ఫొటోలు ఢిల్లీకి పంపున్నట్లు వెల్లడించారు. అదే విధంగా మన మట్టి మన దేశం కార్యక్రమంలో భాగంగా 20 వార్డులోని మట్టిని సేకరించి ఆసక్తి ఉన్న ముగ్గురు కౌన్సిలర్లను ఢిల్లీలో అందజేయడానికి పంపనున్నట్లు చెప్పారు. వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, కె. అనంత లక్ష్మి, కౌన్సిలర్లు, కో అప్షన్ మెంబర్లు, మునిసిపల్ మేనేజర్ శ్రీదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సంక్షేమ పథకాలను వివరిస్తున్న కృష్ణ చైతన్య

అద్దంకి: కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. బుధవారం మణికేశ్వరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో ప్రజలకు పాలన అందుబాటులోకి వచ్చిందన్నారు. బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణ మూర్తి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నియామక పత్రాల పంపిణీ


నియామకపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: చీరాల నియోజకవర్గంలో అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు ఎంపికైన ఐదుగురికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ల చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాలను అందించారు. ఆర్డీఓ పి.సరోజిని, చీరాల మండల అధ్యక్షుడు అంకాలరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, గవిని నారాయణ, షేక్ మస్తాన్, ఎస్.అనిల్, మచ్చా సువార్త, దేవేంద్ర పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కరణం వెంకటేష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న కొండ్రు బాబ్జి

చీరాల: చీరాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింతగా బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. పార్టీ పట్టణ-1 అధ్యక్షునిగా నియమితులైన కొండ్రు బాబ్జి బుధవారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో కరణం వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తమపై ఉన్న నమ్మకంపై పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తికి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కోలా శివ, తలకాయల సుధీర్, బొల్లపల్లి అనిల్, జంగా ప్రేమ్, వాసిమల్ల రత్నం, పులిపాటి భూషణం, బట్టు పోతురాజు పాల్గొన్నారు.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా డొక్కా కొండయ్య


కరణం వెంకటేష్‌ను కలిసిన డొక్కా కొండయ్య

చీరాల: మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా డొక్కా కొండయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో చీరాల మున్సిపాలిటీలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఆదర్శ గ్రామంగా సంతరావూరు

చినగంజాం: ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా సంతరావూరు ఎంపికైందని ఎంపీడీఓ తెలిపారు. బుధవారం పథకం ముఖ్య ఉద్దేశాన్ని గ్రామస్తులకు వివరించారు. సర్పంచ్ మార్పు గ్రేసమ్మ, ఈఓపీఆర్డీ గోపాలకృష్ణమూర్తి, కార్యదర్శి కృపారావు, ఏపీఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ నిర్ణయం దేశానికే ఆదర్శం



బీరక సురేంద్ర

చీరాల: బీసీ కుల గణన కోసం అసెంబ్లీలో తీర్మానం చేయడం, వందేళ్ల తర్వాత బీసీ కుల గణను చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర అన్నారు. బుధవారం అసెంబ్లీలో బీసీ కుల గణన బిల్లు పాస్ కావడంతో మీడియాతో మాట్లాడారు. బీసీ కుల గణన చేయడం వలన రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉద్యోగ ఫలాలు పొందుతారన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

బల్లికురవ: పోషకాహారంతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీఓ డి. సుధ అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వైదనలో అవగాహన కల్పించారు. చిన్నారులకు పీపీ 1, పీపీ 2 కిట్లను పంపిణీ చేశారు. చిరుధాన్యాలు, ఆకు కూరలు, పాలు, గుడ్లు, తృణధాన్యాలను నిత్యం ఆహారంగా తీసుకుంటే రక్త హీనత లేకుండా ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వచ్చన్నారు. సూపర్‌వైజర్ సలోమి, సర్పంచ్ మేడా జయలక్ష్మి, ఎంపీటీసీ నక్కా పార్వతి, మేడా శివదుర్గా, గాలం అంజయ్య పాల్గొన్నారు.

మార్టూరు: పోషకాహారం తీసుకోవడం వలన గర్భిణులు, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ పద్మ అన్నారు. బుధవారం చిమ్మిరిబండ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు.



30 లోపు చేరాలి

అద్దంకి రూరల్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో 2023-24 విద్యాసంవత్సరానికి ఈ నెల 30 లోపు మొదటి సంవత్సరంలో చేరాలని స్థానిక కె.ఆర్.కె కళాశాల ప్రిన్సిపల్ వి. మోహన్ రావు బుధవారం తెలిపారు. పూర్తి వివరాలకు 9912414614 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రాథమిక తరగతులే కీలకం

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రాథమిక తరగతుల్లోనే పట్టు సాధించాల్సిన అవసరం ఉందని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్వర్ణలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాల్లో మాట్లాడారు.

ఆరోగ్యంపై అవగాహన

జె.పంగులూరు: మండల పరిధిలోని నూజిళ్ళపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శివచెన్నయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. విష్ణువర్థన్, లలిత, సతీష్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ముగిసిన కాంప్లెక్స్ సమావేశాలు

బల్లికురవ: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు భాషపై పట్టు సాధించేలా తీర్చిదిద్దాలని ఎంఈవో 1,2 వస్త్రం నాయక్, రమేష్‌బాబు కోరారు. బుధవారం కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశాలు ముగిశాయి.

చీరాల అర్బన్: స్కూల్ కాంప్లెక్సులు వృత్తి నైపుణ్య కేంద్రాలుగా మారాలని పర్చూరు డివిజన్ డీవైఈఓ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వేటపాలెం మండలం కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్సు సబ్జెక్టు కాంప్లెక్సును తనిఖీ చేశారు.

మేరీ మట్టి.. మేరా దేష్

మార్టూరు: ఆజాదీగా కా అమృత్ మహోత్సవంలో భాగంగా మార్టూరు మద్ది సత్యన్నారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం నాదేశం.. నా మట్టి కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. పలు పోటీలు జరిగాయి.

చినగంజాం: ఇడుపులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నాదేశం.. నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ఇ- క్రాప్ నమోదు చేయాలి

యద్దనపూడి: ఇ- క్రాప్ పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయాధికారి చల్లగుండ్ల ఆదినారాయణ సిబ్బందికి సూచించారు. బుధవారం పూనూరు, గన్నవరం, యద్దనపూడి, ఆర్బీకేలను పరిశీలించారు.

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

వేటపాలెం: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో 15 రోజులుగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతున్నట్లు డీపీఓ డి. రాంబాబు తెలిపారు. బుధవారం రామన్నపేటలో పరిశీలించారు. అక్టోబర్ 1నప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపడతామని చెప్పారు.

సమాజ సేవ మరువద్దు

చీరాల టౌన్: చదువుకునే వయసు నుంచే విద్యార్థులు సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ సీహెచ్.వి.వి. సత్యనారాయణ సూచించారు. బుధవారం కావూరివారిపాలెంలో బాపట్ల ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఎం.శ్రీనివాసరావు, హెచ్ఎం సుబ్రమణ్యం, రమణారెడ్డి, విమల బీరా, బ్లెస్సీ సాగర్ ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

యద్దనపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ సుభాషిణి ఆధ్వర్యంలో వివరాలను సేకరిస్తున్నారు.

చినగంజాం:పర్చూరుమండలంనూతలపాడు గ్రామ సచివాలయం-2లోబుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. ఏఎన్ఎం శృంకర జయవార్త, జి. వసుంధర, పి. సాహితి పాల్గొన్నారు.

కారంచేడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. జెస్సీరాణి అన్నారు. బుధవారం కారంచేడు-2 సచివాలయం పరిధిలో నిర్వహించిన ఇంటింటి సర్వే పరిశీలించారు.

చీరాల రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సి.హెచ్. శేషుబాబు అన్నారు. మరియమ్మపేటలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు.